క్లుప్తంగా

విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం



సంగం: మహాశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని సంగనంలోని తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కాశీ విశ్వేశ్వరుడికి శుక్రవారం రుద్రాభిషేకం నిర్వహించారు. తొలుత కాశీవిశ్వేశ్వరుడికి సకల ద్రవ్యాలతో అభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆరుద్ర నక్షత్రం విశిష్టతను భక్తులకు వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలాధికారులు హాజరుకావాలని కోరారు. కాగా మండల సర్వసభ్య సమావేశానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతారని టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కలిగిరి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి సూచించారు. మండలంలోని తూర్పుగుడ్లదొనలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. దోమలతో జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి జయంతి



సోమశిల : జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి ఖద్దరుమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి ఒక పతాకం కావాలని పరితపించిన పింగళి వెంకయ్య గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దేశ సమగ్రతను చాటేలా పతాకాన్ని రూపొందించిన పింగళి తెలుగు వారు కావడం మనకు గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మహేష్, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, శివకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

సమయాన్ని పాటించాలి


సీతారామపురం: సచివాలయ సిబ్బంది సమయ పాలనను పాటించాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్ సూచించారు.అయ్యవారిపల్లి సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా వేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. పింఛన్ల పంపిణీ, ఓడీఎఫ్ ప్లస్‌లపై ఆరా తీశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, రాజేష్ ఉన్నారు.

9న రైతు సంఘాల ఆందోళన

ఉదయగిరి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో రైతు సంఘ నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. కౌలు రైతులకు ధ్రువపత్రాలు అందజేసి పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు అందించాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి సాగు, తాగు నీటి కష్టాలు తీర్చాలన్నారు. నాయకులు కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్‌గ్రేడ్‌కు అడుగులు పడేనా?

కావలి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకనుగుణంగా ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంది. ఇందుకోసం మున్సిపాలిటీకి భారీగా నిధులు అవసరం. కానీ ఇప్పటికీ మున్సిపాలిటీ ఫస్ట్‌గ్రేడ్‌గానే కొనసాగుతుండడంతో దామాషా ప్రకారం నిధులు రాక అభివృద్ధికి అడుగులు పడడం లేదు. దీనిపై ప్రభుత్వం, పాలకులు ఇప్పటి నుంచే శ్రద్ధ చూపి మున్సిపాలిటీని స్పెషల్‌గ్రేడ్‌గా మార్చి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో ముందడుగులు వేయాలి. లేకపోతే భవిష్యత్తులో పట్టణ ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



కావలి పట్టణ వ్యూ

కావలి: పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకనుగుణంగా మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ చేసే దిశగా అడుగులు పడాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన నివేదికలు ఐదేళ్ల క్రితమే ప్రభుత్వానికి స్థానిక అధికారుల నుంచి అందాయి. దీంతో ప్రాథమికంగా స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునేందుకు అవసరమైన ప్రక్రియకు సానుకూలత ఏర్పడింది. కావలిని స్పెషల్‌గ్రేడ్‌గా మార్చితే భవిష్యత్‌లో మరిన్ని నిధులు మంజూరు కావడానికి, మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించవచ్చనే బలమైన అభిప్రాయానికి ఉన్నతాధికారులు కూడా వచ్చారు. దీంతో కావలిని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా మార్చేందుకు స్థానిక అధికారుల ద్వారా భారీ కసరత్తుకు ఐదేళ్ల క్రితమే శ్రీకారం చుట్టారు. మున్సిపల్ చట్టం ప్రకారం మొత్తం ఆరు కేటగిరీల మున్సిపాలిటీలు ఉంటాయి. విస్తీర్ణం, జనాభా ప్రాతిపదికపై ఆయా కేటగిరీలుగా ప్రభుత్వ గుర్తిస్తోంది. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీ అయ్యే గ్రామాలు/పట్టణాలను వరుసగా థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీ, సెకెండ్‌గ్రేడ్, ఫస్ట్ గ్రేడ్, స్పెషల్ గ్రేడ్, సెలెక్షన్ గ్రేడ్‌గా పెంచుకుంటూ పోతుంది. చివరిగా నగరం స్థాయి సంతరించుకుంటే కార్పొరేషన్ చేస్తారు. 50 ఏళ్లలో కావలి పట్టణం మూడో స్థాయి నుంచి ఫస్ట్‌గ్రేడ్ మున్సిపాలిటీ స్థాయికి చేరింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కావలి పట్టణానికి అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరు కావాలంటే ఈ స్థాయి సరిపోవడం లేదు. ప్రస్తుతం 61.09 చదరపు కిలోమీటర్లు మాత్రమే కావలి మున్సిపాలిటీ విస్తరించి ఉంది. కానీ వంద చదరపు కిలోమీటర్లకు పైబడిన విస్తీర్ణంలోని మున్సిపాలిటీలకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర ఆర్థిక సంస్థలు నిధులు మంజూరులో అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నాయి. అందుకే కావలి మున్సిపాలిటీ హోదాను పెంచే దిశగా చుట్టుపక్కల ప్రాంతాలను విలీనానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తద్వారా కావలి మున్సిపాలిటీ విస్తీర్ణం 125 చదరపు కిలోమీటర్లకు చేరుకోనున్నది. జనాభా సంఖ్య సైతం మూడు లక్షలకు పెరగనుంది. ఈ అంశాలు సాంకేతికంగా మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్‌గా మార్చేందుకు మార్గం సుగమమం చేయనున్నాయి.

2023 నాటికి పెరగనున్న పట్టణ జనాభా

2030 నాటికి పట్టణ ప్రాంతాల్లో నివసించే జనాభా శాతం 66 నుంచి 70 శాతానికి చేరుకుంటుందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలకు గ్రామీణులు ఎక్కువగా వలస వస్తున్నారు. ఇందుకు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక కారణాలు ఉన్నాయి. ఆర్థిక వనరులు పెంపొందుతున్న పట్టణాల్లో ఉద్యోగ, స్వయం ఉపాధి, కూలీ పనులు, సేవారంగం వృత్తులలో అవకాశాలతో పల్లెల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. అందుకనుగుణంగా పట్టణాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆ దిశగానే కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీలు, అమృత్, స్వచ్ఛభారత్ కింద పట్టణాలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేస్తోంది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లు, వాటికి అనుబంధంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలతో కావలి పట్టణం రానున్న పదేళ్లలో శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అందుకనుగుణంగా పట్టణాభివృద్ధికి మున్సిపాలిటీని స్పెషల్‌గ్రేడ్‌గా మార్చి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో ముందడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫస్ట్‌గ్రేడ్‌తో రైళ్ల స్టాపింగ్‌కు విముఖత

కావలి స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని పట్టణ ప్రజలు పలుమార్లు రైల్వే అధికారులకు విజ్ఞప్తులు అందజేశారు. ఆ సమయంలో రైల్వే శాఖ అధికారులు కావలి జనాభా, మున్సిపాలిటీ హోదా, కావలి ప్రత్యేకతల గురించి వారికి అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలిస్తున్నారు. వారి రికార్డుల ప్రకారం కావలి జనాభా 80 వేలు.. కావలి మున్సిపాలిటీ ఫస్ట్‌గ్రేడ్...ప్రత్యేకతలు ఏమీ లేవు... ఈ అంశాలు వారికి సమాధానంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పట్టణ జనాభా 2.50 లక్షల మందికి పైగా ఉన్నా ఇంకా ఫస్ట్‌గ్రేడ్ మున్సిపాలిటీగా కొనసాగుతుండడంతో కావలి రైల్వే స్టేషన్ ను సీ గ్రేడ్ రైల్వే స్టేషన్‌గా పరిగణించి మరిన్ని రైళ్లకు స్టాపింగ్ కల్పించేందుకు రైల్వేశాఖ సుముఖత చూపడం లేదు.

జనాభాకు తగ్గట్లుగా వసతులు కల్పించాలి



ఇటీవల కావలి పట్టణానికి గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా వలస వస్తున్నారు. పిల్లలు చదువు నిమిత్తం వచ్చి పట్టణానికి వచ్చి నివాసం ఉంటున్న వారు బాగా పెరిగారు. అందుకనుగుణంగా వసతులు మాత్రం పెరగడం లేదు. పట్టణ జనాభాకు తగినట్లుగా వసతులను కల్పించాలి.

– మహేష్, కావలి

పట్టణాభివృద్ధికి చర్యలు చేపట్టాలి



పట్టణంలో ఏ వీధికి వెళ్లినా ఇరుకుగానే కనిపిస్తున్నాయి. పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం ఎక్కడా కనిపించదు. వీధి దీపాలు కూడా సక్రమంగా లేదు. ఉన్న చోట కూడా సక్రమంగా వెలగడం లేదు. పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాల్సి అవసరం ఉంది.

–వెంకట్, కావలి



కావలి మున్సిపల్ కార్యాలయం

అక్రమ దుకాణాలను తొలగించాలి

సీతారామపురం: మండలంలోని పోలంగారిపల్లి రోడ్డు సెంటర్‌లో నెమళ్లదిన్నెకు వెళ్లే మార్గంలో ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించి నిర్మించిన దుకాణాలను వెంటనే తొలగించాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి ఆదేశించారు. పోలంగారిపల్లి రోడ్డు సెంటర్‌లో నెమళ్లదిన్నె, సోంపల్లి, బెడుసుపల్లి, గంగవరం గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించి కొందరు దుకాణాలను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో పోలంగారిపల్లి రోడ్డు సెంటర్‌లోని దుకాణాలను ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ శుక్రవారం పరిశీలించారు. నిర్ణీత గడువులోగా దుకాణాలను తొలగించాలని ఆక్రమణదారులకు ఆదేశాలు జారీచేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

ఉదయగిరి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం చారిత్రాత్మకమని ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవాసమితి రాష్ట్రాధ్యక్షుడు కాకి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఎందరో ప్రాణాలు కోల్పోయారన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలకు న్యాయం దక్కిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జాషువా మాదిగ, బాలగురవయ్య, ఆనందరావు, అశోక్, బీజేపీ నాయకుడు రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మంద కృష్ణమాదిగ కృషి ఫలితంగా మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ నెరవేరిందని ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుపాలు, బాలస్వామి, జయపాల్ పేర్కొన్నారు. శుక్రవారం వారు సీతారామపురంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు శుభపరిణామమన్నారు. ఈ నిర్ణయంతో మాదిగలతో పాటు మాదిగ ఉపకులాలకు, మాలలకు న్యాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



దుత్తలూరు సెంటర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుత్తలూరు: ఎస్సీవర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు దుత్తలూరు సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్‌రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రి, ఎంఎస్‌పీ నాయకులు కృష్ణయ్య, యద్దనపూడి రమణయ్య, బర్రె అర్జున్, యనమల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల ధ్వంసం దారుణం

దుత్తలూరు: నందిపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మండ్ల వెంకటేశ్వర్లుకు చెందిన నిర్మాణాలను టీడీపీ నేతలు కూల్చివేయడం దారుణమని జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే టీడీపీ నేతలు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి నిర్మాణాలు ధ్వంసం చేసి ఆర్థికంగా నష్టపరచడం భావ్యం కాదన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధితుడికి తగిన న్యాయం చేయాలని కోరారు.

బళ్లారి రాఘవకు నివాళులు



బళ్లారి రాఘవకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఉదయగిరి: ప్రముఖ రంగస్థల నటుడు బళ్లారి రాఘవ 144వ జయంతిని స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రంగస్థల నటుడిగా, నాయవాదిగా బళ్లారి రాఘవ విశేష సేవలు అందించారన్నారు. ఏటా బళ్లారి రాఘవ పేరు మీద కర్ణాటకలో కళాకారులకు జిల్లా, రాష్ట్రస్థాయిలో అవార్డులు అందజేస్తున్నారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారి రమేష్, సీనియర్ ప్రొఫెసర్లు గోపికృష్ణ, పాల్, సునీత, కిషన్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి



ఆత్మకూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మారుతీదేవి



ఏఎస్‌పేటలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి గీతాకుమారి

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి పేర్కొన్నారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువులు, విత్తనశుద్ధి, వేపనూనె, తదితరాలను వినియోగించి ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేయడంపై అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, ఏఓ కిషోర్‌బాబు, ప్రకృతి వ్యవసాయం ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రెయినర్లు వెంకటలక్ష్మి, సీఆర్పీ సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

అనుమసముద్రంపేట: రైతులు వరి పంట సాగులో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కేంద్ర వ్యవసాయాధికారి గీతాకుమారి తెలిపారు. ఏఎస్‌పేటలో ఆత్మ సౌజన్యంతో వరి పంటలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయాధికారుల సిఫార్సుల మేరకు నత్రజని, భాస్వరం, పొటాష్, ఇతర సూక్ష్మపోషకాలను పంటలకు వినియోగించాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. వరి సాగుకు ముందు జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పైర్లను పూత దశ వరకు పెంచి నేలలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కే కిరణ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయాశాఖ అధికారి టీ రజని, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భోజనశాల మంజూరుకు వినతి

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలకు భోజనశాలను మంజూరుచేయాలని ప్రిన్సిపల్ పుష్పరాజ్, పూర్వవిద్యార్థులు కోరారు. ఈ మేరకు గండిపాళేనికి శుక్రవారం వచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోజనశాల శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే నూతన భోజనశాల మంజూరుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. పూర్వ విద్యార్థులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, సుమన్, రవి, విజయభాస్కర్‌రెడ్డి, కూర్మయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


మాన్యం భూములపై సమగ్ర విచారణ చేపట్టాలి

సీతారామపురం: మారంరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 190–2, 132–3లో ఉన్న రజక, మాదిగ మాన్యం భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరపాలని మారంరెడ్డిపల్లి ఎస్సీకాలనీవాసులు కోరారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం వారు నిరసన తెలిపారు. గత 60 ఏళ్లుగా తమ ఆధీనంగా సాగులో ఉన్న భూములపై సర్వహక్కులు తమకే చెందాలని వారు డిమాండ్ చేశారు. గతంలో గ్రామపెద్దల సమక్షంలో ఇరువురి మాన్యం భూములను పరస్పరం మార్చుకోవడం జరిగిందన్నారు. అప్పట్నుంచి ప్రశాంతంగా భూములను సాగుచేసుకుంటున్నామని తెలిపారు. ఈ తరుణంలో పంచాయతీ సర్పంచ్ భర్త కన్నేశారన్నారు. కొందరిని ప్రలోభాలకు గురిచేసి రజక మాన్యాన్ని కొనుగోలు చేసినట్లుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించడంతో పాటు రికార్డులు సైతం తారుమారు చేశారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే నంబర్ 190–2లోని మాన్యం భూమిపై సర్వహక్కులు కలిగిన దళితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వెంకట కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్‌డీ సంస్థ చైర్మన్ కలివెల ఎలీషాకుమార్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీలు


తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు



ఏఎస్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది



సీతారామపురంలో..



సోమశిల: రేవూరు సెక్టార్ పరిధిలో..

చేజర్ల: తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత అన్నారు. మండలంలోని పుట్టుపల్లి, పెరుమాళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి పుట్టుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లి ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, అంగన్‌వాడీలు ఎస్ ధనలక్ష్మి, సుభాషిణి, ఏఎన్ఎం రత్నకుమారి, రిజ్వాన, సుశీల పాల్గొన్నారు.

ఉదయగిరి: ఐసీడీఎస్ సూపర్‌వైజరు షాను ఆధ్వర్యంలో గడ్డంవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు అరుణ, రమ, సుజాత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏఎస్‌పేటలో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మంజులమ్మ పాల్గొని తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు.

అల్లూరు: అల్లూరులోని అల్లిమడుగుకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వైద్యఆరోగ్య సిబ్బంది రాజ్యలక్ష్మి, మహిళా పోలీసు శైలజ, అంగన్‌వాడీలు లలితమ్మ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్ల ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, హెచ్ఎం కళావతి, ఏఎన్ఎం లీలావతి, అంగన్‌వాడీ సిబ్బంది కృష్ణవేణి, దేవసేన, దొరసానమ్మ, రత్నమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు సెక్టార్ పరిధిలోని ఆమనిచిరువెళ్ల కొత్తూరు, వడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, కాకూరు నాగమణి పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు ప్రసన్న, మల్లెమ్మ, సునీత, మహబూబ్‌జాన్, ప్రభావతి తదితరులు ఉన్నారు.

సీతారామపురం: ఐసీడీయస్ సూపర్‌వైజర్ తేజస్విని ఆధ్వర్యంలో సీతారామపురంలోని పడమటివీధి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు భవాని, ఆదిలక్ష్మి, జానీ, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్ : బోయలచిరివెళ్లలో..



అల్లూరు: అల్లిమడుగుకాలనీలో..



చేజర్ల మండలం పుట్టపల్లిలో..

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంటైనర్

కావలి: మండలంలోని గౌరవరం సమీపంలోని ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం నమ్మిని గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పబ్బా లింగయ్య స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు..చెన్నై నుంచి హైదరాబాద్‌కు హెరిటేజ్ డెయిరీకి చెందిన ఐస్‌క్రీం లోడ్‌తో వెళుతున్న కంటైనర్ గౌరవరం ఫ్లైఓవర్ వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ ముందు భాగం దెబ్బతినగా డ్రైవర్ పబ్బా లింగయ్య కాళ్లకు, తలకు స్వల్పంగా గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కావలి రూరల్ ఎస్సై బాలకృష్ణయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఉదయగిరి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన గండిపాళెంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన బుడంగుంట చినవెంగయ్య (53) గండిపాళెం జలాశయం వద్ద నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాత్రి స్నానం చేసేందుకు ఇంట్లోని బాత్‌రూంలోకి వెళ్లాడు. అక్కడ విద్యుత్ లైట్ కోసం ఏర్పాటు చేసిన తీగను తగలడంతో షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి సమీపంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యసిబ్బంది చినవెంగయ్య అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చినవెంగయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.